నృత్య మనోహరం.. అభినయ మాధవం

- కూచిపూడి విజయశిఖరం మాధవపెద్ది మూర్తి
- నేడు కృష్ణాజిల్లా కూచిపూడిలో 4వ ప్రపంచ కూచిపూడి నాట్యదినోత్సవం
- రాష్ట్ర మంత్రులు రోజా సెల్వమణి, జోగి రమేష్ చేతులమీదుగా పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జీవిత సాఫల్య పురస్కారం



డెహ్రాడూన్‌లో నటి హేమమాలినితో నర్తిస్తూ

తెనాలి: 'మాధవపెద్ది' అనగానే తెలుగువారికి సంగీతం, గానం, నాటకం గుర్తుకొస్తాయి. సినీ నేపథ్య గాయకుడిగా ఒకతరం ప్రేక్షకులకు సుపరిచితుడైన మాధవపెద్ది సత్యం, రంగ స్థలంపై అపర దుర్యోధనుడు మాధవపెద్ది వెంకట్రామయ్య, సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్... ఇలా చెప్పుకుంటూపోతే ఎందరో కళాకారులు. సంగీ తం, గాత్రం, రంగస్థలం, నృత్యం మాధవపెద్ది వంశీకులకు ఏదొక కళారూప వారసత్వం. ఆ కోవకు చెందినవారే అంతర్జాతీయ నృత్యకళాకారుడు మాధవపెద్ది మూర్తి. ఆయన మాధవపెద్ది సత్యం ఏకైక కుమారుడు.

నేడు నాట్యదినోత్సవం -23 వేడుకలు..

కృష్ణాజిల్లా కూచిపూడిలో ఆదివారం జరగనున్న 4వ ప్రపంచ కూచిపూడి నాట్యదినోత్సవం-23 వేడుకల్లో రాష్ట్రమంత్రులు రోజా సెల్వమణి, జోగి రమేష్ చేతుల మీదుగా పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జీవిత సాఫల్య పురస్కారం-2022ను స్వీకరించనున్నారు.

స్వస్థలం బ్రాహ్మణకోడూరు..

వివిధ నృత్యరీతులకు అనుగుణమైన కదలికలను అలవోకగా ప్రదర్శిస్తూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణిస్తున్న 'కలైమామణి' మాధవపెద్ది మూర్తి స్వస్థలం పొన్నూరు సమీపంలోని బ్రాహ్మణకోడూరు. తండ్రి మాధవపెద్ది సత్యం సినీ గాయకుడు కావటంతో బాల్యం చెన్నైలోనే గడిచింది. అక్కడే పొరుగింట్లో ఉండే ప్రఖ్యాత నర్తకి యడవల్లి రమ స్ఫూర్తి, తండ్రి స్నేహితుడైన ప్రముఖ కూచిపూడి నాట్యగురువు వెంపటి చినసత్యం దగ్గరే నాట్యశిక్షణ తీసుకున్నారు. చదువుతూనే రెండు దశాబ్దాలు సాధన చేశారు. పౌరవిమానయానశాఖలోని వాయుదూత్‌లో ఆరేళ్లు పనిచేశాక వదిలేశారు. నాట్యంలోనే సంతృప్తి ఉందన్న భావనతో చెన్నైలోనే స్థిరపడ్డారు.

హేమమాలినితో కలిసి 750 ప్రదర్శనలు..

నాట్య కళాకారుడు మూర్తి అనగానే, నృత్య రూపకాల్లో పోషించిన శివుడు, నారదుడు, శిశుపాలుడు, బౌద్ధభిక్షువు ఆనందుడు, సత్యవంతుడు, మహావిష్ణువు, భోజరాజు పాత్రలను అభిమానులు గుర్తుచేసుకుంటారు. తన అభినయ కౌశలంతో వివిధ నృత్యరూపకాల్లోని పాత్రలతో ఎంత విస్తృతంగా వైవిధ్యాన్ని పోషించవచ్చో ఆయన నిరూపించారు. గురువు వెంపటి చిన సత్యం శిష్యురాలు, సుప్రసిద్ధ బాలివుడ్ నటీమణి హేమమాలినితో కలిసి గత 32 ఏళ్లుగా దేశవిదేశాల్లో నాట్యప్రదర్శనలు ఇస్తున్నారు. ఇటీవల డెహ్రాడూన్‌లో నృత్యరూపకంతో మొత్తం 750 ప్రదర్శనలిచ్చినట్టు మూర్తి చెప్పారు. తన దగ్గర కొన్ని నృత్యరీతులను నేర్చుకున్న మీనాక్షి శేషాద్రితో కలిసి 200 పైగా ప్రదర్శనలిచ్చారు.

ఎందరో నటులకు కూచిపూడిలో శిక్షణ..

సినిమా తారల్లో శాస్త్రీయ నృత్యంపై ఆసక్తిని, అంతకుమించిన గ్లామర్‌ను 1995లో ఆయన స్థాపించిన 'శివ ఫౌండేషన్' సాధించింది. సినిమా, కళారంగాలకు చెందిన పలువురు తారలు, ప్రముఖులను ఫౌండేషన్ ఆకర్షించింది. హేమమాలిని, మీనాక్షి శేషాద్రి, భానుప్రియ, శ్రీప్రియ, సీత, ఇంద్రజ, రవళి, వినీత్, హారిక, జయభారతి, లయ వంటి టాలీవుడ్ నటీనటులు శివ ఫౌండేషన్‌లో నృత్యరీతులను నేర్చుకొన్నవారే. కూచిపూడి నాట్యకళను చిత్తశుద్ధితో దేశవిదేశాల్లో వ్యాపింపజేస్తూ ఖండాంతర ఖ్యాతిని పొందిన ప్రముఖుల్లో మూర్తి ఒకరు. 'కళాకారుడనే వాడు తనవంటి కళాకారులను తయారుచేసినపుడే ఏ కళయినా తర్వాతి తరాలవరకు నిలుస్తుంది' అని చెప్పే గురువు వెంపటి చినసత్యం బాటలోనే కూచిపూడి వైభవాన్ని భావితరాలకు అందిస్తున్నారు. నృత్యప్రదర్శనలతో దేశవిదేశాల్లో కూచిపూడి వైభవాన్ని చాటుతున్నారు. తన కృషికి గుర్తింపుగా తమిళనాడులో కళాకారులకు అందజేసే అత్యున్నత అవార్డును 'కలైమామణి' అవార్డును నాటి ముఖ్యమంత్రి జయలలిత చేతులమీదుగా స్వీకరించారు. మళ్లీ ఇప్పుడు కూచిపూడి నృత్యానికి పుట్టిల్లు కూచిపూడిలో తన గురువు వెంపటి చినసత్యం జీవిత సాఫల్య పురస్కారం అందుకోనుండటం తన అదృష్టమని ఆయన తెలిపారు.

పేదలకు అన్నదానం



తెనాలి అర్బన్: శ్రీ వీరశైవ బసవేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం చెంచుపేటలోని జిల్లా వైద్యశాల ముందు పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నెలవెల్లి విజయలక్ష్మి, చుక్కా సతీష్, నెలవెల్లి బసవయ్య, పాలకొల్లు బసవేశ్వరరావు, చుక్కా భాను, కుంకలగుంట మల్లికార్జునరావు, ఎస్.కె.ఎస్.ప్రసాద్, దూపం ప్రసాద్, చుక్కా శ్రీను, వాసుబాబు, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



తెనాలి అర్బన్: ఆలా గోపాలస్వామి, సుబ్బారావు, పద్మావతి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు చక్రాయపాలేనికి చెందిన లైసెన్స్‌డ్ సర్వేయర్ కొరగంజి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం మహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. అనంతరం వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కె.వెంకటేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, సీహెచ్.లోకనాథం, పి.కుటుంబరావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 25 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి పెదవడ్లపూడి ఫ్లెటైవర్ సమీపంలో శుక్రవారం రాత్రి పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టాల వెంబడి మృతదేహాన్ని స్థానికులు శనివారం ఉదయం గుర్తించి తెనాలి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి గీతాలాపన



తెనాలి: రూరల్ మండలం జగ్గడిగుంటపాలెం పంచాయతీ పరిధిలోని ప్రగడ కోటయ్యనగర్‌లో గల సీతారాములస్వామి మందిరంలో శనివారం సాయంత్రం ఆంజనేయస్వామి గీతాలాపన చేశారు. తెనాలి అన్నమయ్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఈ భక్తిగాన కార్యక్రమాన్ని జరిపారు. ప్రతి శనివారం సాయంత్రం 6-8 గంటలకు భక్తి గీతాలాపన చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక భక్త బృందం ఆధ్వర్యాన కొండపి వసుంధర నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అందె రాజేశ్వరి, ఆకురాతి మౌనిక, కొండవీటి శ్రీనివాసరావు, కొండపి దత్తుశర్మ, అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపునకు వర్క్ షాపులు దోహదం



తెనాలి అర్బన్: నైపుణ్యం పెంపునకు వర్క్‌షాపులు దోహదపడతాయని డేటా పాయింట్ ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ సభ్యుడు శబరీనాథ్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా శబరీనాథ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పుల్ని విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. వర్క్‌షాపు ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. రానున్న రోజుల్లో అంతా మంచి ఉద్యోగాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువు ప్లస్ టాలెంట్ అవసరం

ఇంటెలిజెన్స్ డీఎస్పీ గోలి లక్ష్మయ్య



ప్రదర్శన విద్యార్థులతో డీఎస్పీ లక్ష్మయ్య, నిర్వాహకులు

తెనాలి: విద్యార్థులు తరగతి పాఠాలతో పాటు ఏదొక విభాగంలో నైపుణ్యం అలవరచుకోవాలని గుంటూరు ఇంటెలిజెన్స్ డీఎస్పీ గోలి లక్ష్మయ్య సూచించారు. విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పించే ఆశయంతో తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యశాల(వర్క్‌షాపు)ను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పట్టణానికి చెందిన తెనాలి రామకృష్ణ అకాడమీ ప్రతినెలా రెండో శనివారం నిర్వహిస్తున్న చదువు ప్లస్ టాలెంట్... నేటి విద్యార్థి అనే 4వ నెల కార్యశాలను స్కిట్, పద్యం అనే అంశాలపై స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో నిర్వహించారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు రెండు అంశాల్ని సోదాహరణంగా వివరించారు. గాయకుడు వెంపటి సత్యనారాయణ రాగయుక్తంగా పద్యగానంలో మెలకువల్ని తెలియజేశారు. వివిధ పాఠశాలల్నుంచి 150 విద్యార్థులు హాజరయ్యారు. ఉయం నుంచి సాయంత్రం వరకు శిక్షణాపూర్వక ప్రదర్శనలు కొనసాగాయి. వచ్చే నెల రెండో శనివారం మిమిక్రీ, జనరల్ నాలెడ్జ్ అంశాలపై కార్యశాల ఉంటుందని తెలిపారు. శ్వేతా అండ్ గ్రూప్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

క్రమశిక్షణతోనే విజయానికి బాటలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

తెనాలి అర్బన్: క్రమశిక్షణతో కూడిన విద్యను అందరూ నేర్చుకోవాలని గుప్తా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ సూచించారు. బుర్రిపాలెం రోడ్డులోని కొత్తమాసు చంద్రకళ పీజీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాల్ని ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఎస్.వి. సురేష్‌బాబు, పాట్టి శ్రీరాములు విద్యా సంస్థల మేనేజర్ దూళిపాళ్ల శ్రీనివాసరావు, ఎంసీఏ అధ్యాపకులు గడ్డిపాటి భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ



తెనాలి టౌన్: పట్టణ నరేంద్రదేవ్ కాలనీలోని పేదలకు శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యుడు సుంకర సీతారామయ్య జ్ఞాపకార్థం కుమారుడు శ్రీనివాసరావు సహకారంతో శనివారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 200 మంది పేదలు, చిన్నారులకు భోజన ప్యాకెట్లు అందజేసినట్లు ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, ప్రతాప్, సుంకర శ్రీనివాసరావు, లక్ష్మి, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.